క్లుప్తంగా

మహిళల ర్యాలీ



మహాముత్తారం: అసెంబ్లీ ఎన్నికల్లో మంథని ఎమ్మెల్యేగా దుద్దిళ్ల శ్రీధర్‌బాబు గెలువడంతో సోమవారం మండలంలో మహిళలు భారీ ర్యాలీ తీశారు. జెడ్పీటీసీ శారద, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అవార్డు అందుకోవడంపై హర్షం

చిట్యాల: మండలంలోని చల్లగరిగ గ్రామానికి చెందిన ప్రముఖ సినీ గేయ రచయిత, అస్కార్ అవార్డు గ్రహీత కనుకుంట్ల చంద్రబోస్‌కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయనగరంలో ఆనంద గణపతి ఆడిటోరియంలో గురజాడ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం విశిష్ట అవార్డు అందుకోవడంపై తెలంగాణ సామాజిక రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామిడి సతీష్ రెడ్డి ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. కళా సాంస్కృతిక రంగాల్లో కృషి చేసిన వారికి ప్రతి సంవత్సరం గురజాడ విశిష్ట పురస్కారం అందజేస్తారని అందులో భాగంగా ఈ సంవత్సరం చంద్రబోస్‌కు రావడం ఆనందదాయకమన్నారు.

మండలంలో కాంగ్రెస్‌కు 3,807 ఓట్ల మెజార్టీ

ఎస్ఎస్ తాడ్వాయి : మండలంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి సీతక్క 3,807 ఓట్ల మెజార్టీ దక్కింది. సీతక్కకు 8,844, బీఆర్ఎస్ అభ్యర్థి బడే నాగజ్యోతికి 5,037, బీజేపీ అభ్యర్థి అజ్మీరా ప్రహ్లాద్‌కు 399 ఓట్లు పోలయ్యాయి. మండలంలోని మొత్తం 26 బూత్‌లు ఉండగా, బీరెల్లి బూత్‌లో బీఆర్ఎస్ అభ్యర్థికి కేవలం 03 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. బీరెల్లితో పాటు మండలంలోని మిగతా అన్ని బూత్‌ల్లో కూడా కాంగ్రెస్‌కు స్పష్టమైన మెజార్టీ రావడంతో సీతక్క 3,807 ఓట్ల ఆధిక్యం దక్కించుకుంది. బడే నాగజ్యోతి సొంత మండలం కావడంతో బీఆర్ఎస్ వైపు ప్రజలు మొగ్గు చూపుతారని బీఆర్ఎస్ నేతలు భావించినప్పటికి అంచనాలు తారుమారయ్యాయి. దీంతో బీఆర్ఎస్ నేతలు ఎక్కడ విఫలమయ్యామోనని తెలియక తలలు పట్టుకుంటున్నారు.

కేయూలో ఇద్దరికి డాక్టరేట్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో ఇద్దరు పరిశోధకులకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఫర్ఫార్మన్స్ అప్రైసల్ ఇన్ కోల్ ఇండస్ట్రీ – ఏ స్టడీ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల పరిశోధకురాలు సంగాల సుమలతకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి తెలిపారు. ఆ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ కే.సాయిలు పర్యవేక్షణలో సుమలత తన పీహెచ్‌డీ పూర్తిచేశారు. అలాగే, స్టడీ ఆన్ ది కో ఎఫీసియంట్ ఇన్‌క్వాలిటీస్ ఫర్ సమ్ సబ్‌క్లాసెస్ ఆఫ్ అనాలటిక్ ఫంక్షన్స్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి గణిత విభాగం పరిశోధకుడు కే.యాకయ్యకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు మల్లారెడ్డి పేర్కొన్నారు. ఆ విభా గం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.భారవి శర్మ పర్యవేక్షణలో యాకయ్య తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

రైతులకు 'మిచాంగ్' భయం



కోతకు సిద్ధంగా ఉన్న వరి పొలం



కొయ్యూరు సెంటర్‌లో ఆరబోసిన ధాన్యం

- చివరి దశకు వచ్చిన వరి పంట
- ఆందోళనలో అన్నదాత

మల్హర్: మిచాంగ్ తుపాన్ ప్రభావంతో ఆకాశంలో మబ్బులు కమ్ముకుంటున్న వేళ రైతుల గుండెల్లో గుబులు పుడుతుంది. తుపాన్ ప్రభావంతో జిల్లాలో మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని ఇప్పటికే వాతావరణ శాఖ ప్రకటించింది. దీంతో ఏక్షణాన వాన, గాలి, దుమారం వస్తోందోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మండలంలో వరి పంట కోతకు వచ్చి చివరి దశ చేరుకుంది. ఈ పరిస్థితుల్లో కోతకు సిద్ధంగా ఉన్న వరి పంటకు తుపాన్ వల్ల వచ్చే గాలి దుమారం, వర్షంతో పొలాలు నేలమట్టమై తీవ్ర నష్టం జరుగుతుందని రైతులు కలవరపడుతున్నారు. వానాకాలం సీజన్‌లో మండల వ్యాప్తంగా రైతులు 15 వేల ఎకురాల పైచిలుకు వరి సాగు, ఇతర పంటలు సాగు చేసినట్లు వ్యవసాయ అధికారులు వెల్లడిస్తున్నారు. ప్రస్తుతం వరి పొలాలు చివరి దశకు చేరడంతో ఇప్పటికే అన్ని గ్రామాల్లో వరి కొతలు ప్రారంభించారు. తుపాన్ ప్రభావంతో కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని సమాచారం. రైతులు వరి పంటను వీలైనంత తొందరగా కోతలు పూర్తి చేసి కల్లాలోకి తరలించడంలో నిమగ్నమయ్యారు.

వర్షం వస్తే నష్టమే

వరి పంట కోతకు సిద్ధంగా ఉన్న తరుణంలో గాలులతో కూడిన వర్షం పడితే పంట మొత్తం నేలవాలి పోతుందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. గతంలో కురిసిన వర్షాలతో ఇప్పటికే సరైన దిగుబడి రాలేదని ఇప్పుడు చివరి దశలో ఆకాల వర్షాలు కురిస్తే పంట చేతికిరాదని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్టిన పెట్టుబడి రాక అప్పుల పాలవుతామని ఆందోళన చెందుతున్నారు. గతంలో కురిసిన భారీ వర్షాల కారణంగా కొన్ని చోట్ల పొలాల్లోకి వరదలతో పాటు భారీగా ఇసుక మేటలు చేరున్నాయి. దీంతో పొలాలు వదిలేశామని రైతులు తెలుపుతున్నారు.

ప్రారంభం కాని కొనుగోళ్లు

మండలంలో కోతలు ప్రారంభమవడంతో హార్వెస్టర్లతో పంటలను కోసి కల్లాలకు తరలిస్తున్నారు. దీంతో ఇప్పటికే కల్లాలోకి ధాన్యం చేరుకుంది. మబ్బులు రావడంతో రైతులు ముందస్తుగా కల్లాలో చేరుకొని ధాన్యానికి పరదాలు కప్పుకుంటున్నారు. ప్రస్తుతం మండలంలో ఎక్కడ కూడా అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించ లేదు. దీంతో కల్లాల్లోకి భారీగా ధాన్యం చేరుకుంది. అధికారులు స్పందించి ధాన్యం కొనుగోలు కేద్రాలు ప్రారంభించి సేకరణ వేగవంతం చేయాలని రైతులు వేడుకుంటున్నారు.

భయమేస్తోంది..



ఆకాశంలో మబ్బులు వస్తుండడంతో భయంగా ఉంది. నాకు ఉన్న 7 ఎకరాల్లో వరి పంట సాగు చేశాను. తుపాన్ కారణంగా వర్షం పడితే చేతికివచ్చిన పంట తుడిచిపెట్టుకు పోతుందని, దీన్ని దృష్టిలో ఉంచుకొని త్వరగా కోత కోసి కల్లాలకు తరలించాలి అనుకుంటున్నాను. అలాగే అధికారులు ధాన్యం కొనుగోలు ప్రారంభించి కొనుగోళ్ల వేగం పెంచాలి.

– బొమ్మకంటి కిషన్, రైతు, తాడిచర్ల, మల్హర్

సీతక్క విజయంతో వనదేవతలకు పూజలు



ఆర్చి వద్ద పూజలు చేస్తున్న మహిళలు

ఎస్ఎస్ తాడ్వాయి : సీతక్క ఎమ్మెల్యేగా భారీ విజయం సాధించడంతో మండల కేంద్రంలోని సమ్మక్క ద్వారం వద్ద సమ్మక్క సారలమ్మలకు మహిళలు సోమవారం పూజలు నిర్వహించారు. పసుపు, కుంకుమ, కొబ్బరి కాయలు కొట్టి పూజలు చేశారు. కార్యక్రమానికి మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ హాజరై మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజా బలమే గెలిచిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంతో పాటు సీతక్క గెలుపుతో ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. సీతక్క విజయానికి సహకరించిన మండల ప్రజలు, నాయకులు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఇర్ప సునీల్, గ్రామ కమిటీ అధ్యక్షుడు పాక రాజేందర్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు రాంబాబు, నాయకులు ఆనంద్, పాయం కోటేశ్వర్, మహిళలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబురాలు



టపాసులు పేల్చి సంబురాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ నేతలు

వెంకటాపురం(ఎం): తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికసీట్లు కైవసం చేసుకోవడంతో పాటు ములుగు ఎమ్మెల్యే సీతక్క గెలుపొందడంతో మండలంలో కాంగ్రెస్ నేతలు సంబురాలు చేసుకున్నారు. మండల కేంద్రంలో డప్పు చప్పుళ్లతో నృత్యం చేస్తూ టపాసులు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు మిల్కూరి అయిలయ్య, యూత్ నాయకులు సిద్దం రాఘవేందర్, మామిడిశెట్టి కోటి, కాంగ్రెస్ నాయకులు జంగిలి రవి, చెన్నోజు శ్రీనివాస్, కొంపెల్లి రాజిరెడ్డి, రెడ్డి శంకర్, చీకుర్తి రమేష్, అల్లాడి రాజేశ్వర్‌రావు, భూస సాంబయ్య, నల్లా కోటి, కొడారి చేరాలు, మొగిలి, రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన



ప్రతిష్ఠించిన ఎల్లమ్మ తల్లి విగ్రహం

శాయంపేట : మండలంలోని తహరాపూర్‌లో గౌడ కులస్తుల ఆరాధ్య దైవమైన రేణుకా ఎల్లమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. దంచనాల వీరభద్రాచార్యులు, బాణాల లక్ష్మణాచార్యులు, కడివండి రమేష్‌శర్మ, కాగితాల పున్నమాచార్యులు, చీర్లంచ సూర్యనారాయణచార్యులు, ఆసం సుదర్శనాచార్యులు, పొనుగోటి రాజేశ్వరచార్యులు వేదమంత్రోచ్ఛారణల మధ్య అత్యంత వైభవంగా ప్రతిష్ఠించారు. అనంతరం గణపతిపూజ, పుణ్యాహవచనం, వాస్తు పూజ, వాస్తు హోమం, సర్వాగ్నికరణం, గర్తన్యాసం, రత్నాన్యాసం, బీజాన్యాసం, మహా నైవేద్యం, మంత్రపుష్పం, మహాదాశీర్వచనం, కుష్మాండ పూజలు నిర్వహించారు. రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. సర్పంచ్ తాటికొండ మౌనికర వికిరణ్ గౌడ్, గౌడ కులస్తులు తదితరులు పాల్గొన్నారు.

కుంకుమేశ్వరస్వామి ఆలయంలో అన్నదానం



స్వామివారికి లక్ష పుష్పార్చన చేస్తున్న భక్తులు

పరకాల: కార్తీక మాసోత్సవాలను పురస్కరించుకొని పట్టణంలోని శ్రీకుంకుమేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోమాళ్లపల్లి సంపత్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా మాదారం పీఏసీఎస్ వైస్ చైర్మన్ చందుపట్ల రాజేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులు భక్తులకు మహాఅన్నదానం చేశారు. ఆలయ చైర్మన్ గందె వెంకటేశ్వర్లు, ఆలయ ప్రధాన అర్చకుడు కోమాళ్లపల్లి నాగభూషణంశర్మ, ధర్మకర్తలు పాల్గొన్నారు.

లక్ష పుష్పార్చన

పట్టణంలోని శ్రీకుంకుమేశ్వరస్వామి దేవస్థానంలో కార్తీక మాసోత్సవం సందర్భంగా సోమవారం సాయంత్రం గందె ఉదయలక్ష్మి, సదానందం దంపతులు లక్ష పుష్పార్చన కార్యక్రమం నిర్వహించారు. అదే విధంగా సాయంత్రం ఆకాశదీపోత్సవం, పల్లకి సేవ కనులపండువగా నిర్వహించారు.

ఓపెన్ ప్రవేశాలకు గడువు పెంపు

శాయంపేట : ఓపెన్ స్కూల్‌లో 10వ తరగతి, ఇంటర్ ప్రవేశాలకు ఈ నెల 11వ తేదీ వరకు గడువు పొడగించినట్లు సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సుభాషిణి దేవి సోమవారం ప్రకటనలో తెలిపారు. స్పెషల్ ఎన్రోల్మెంట్ డ్రైవ్‌లో భాగంగా గడువు పొడిగించినట్లు ఆమె తెలిపారు. ఈ నెల 11లోపు తెలంగాణ ఓపెన్‌స్కూల్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మావోయిస్టులకు సహకరించొద్దు



రాపల్లికోట క్రాస్ వద్ద కారును తనిఖీలు చేస్తున్న పోలీసులు



టేకుమట్ల: వెల్లంపల్లిలో..

టేకుమట్ల: గ్రామాల్లో ఎవరూ మావోయిస్టులకు సహకరించొద్దని ఎస్సై గట్ల సుధాకర్ అన్నారు. మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో సోమవారం మండలంలోని వెల్లంపల్లిలో వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి, అనుమానితుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో అనుమానితులు తారసపడినా, అనుమానస్పదంగా సంచరించిన పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఎవరైనా మవోయిస్టులకు సహకరిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట ఏఎస్సై అమరేందర్‌రెడ్డి, టీఎస్ఎస్పీ కానిస్టేబుళ్లు ఉన్నారు.

మహదేవపూర్: మండలంలోని రాపల్లికోట, సూరారం, బొమ్మపూర్ గ్రామాల్లో పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. వాహన పత్రాలను పరిశీలించి అనుమానితుల వివరాలు అడిగి తెలుసుకున్నారు.

మహాముత్తారం: మండలంలోని కొర్లకుంట, మాదారం ప్రధాన రహదారితో పాటు లంబాడితండా, డొబ్బల్‌పాడ్, యామన్‌పల్లి రహదారిలోని మూలమలుపుల వద్ద ఎస్సై సుధాకర్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించి అనుమానితులతో మాట్లాడి వదిలేశారు. ఈ తనిఖీల్లో సీఆర్పీఎఫ్, సివిల్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

ఓడినా ప్రజలకు అందుబాటులో ఉంటా..



మాట్లాడుతున్న చల్లా ధర్మారెడ్డి

పరకాల: పదేళ్లు అవకాశం ఇచ్చిన ప్రజలు మార్పు కోరుకోవడంతో నియోజకవర్గంలో తాను ఓడిపోయాయని, అయినా ప్రజలకు అందుబాటులో ఉంటు వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటానని తాజా మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. పరకాలలో సోమవారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. 10 సంవత్సరాల పాలనలో నియోజకవర్గ అభివృద్ధి కోసం తాను, కుటుంబ సభ్యులు కష్టపడ్డామని, కానీ ప్రజలను ఏనాడు బాధపెట్టలేదన్నారు. తన వలన ఎవరికైనా ఇబ్బందులు తలెత్తితే క్షమించాలని ఆయన కోరారు. రాజకీయంలో గెలుపు, ఓటమి సహజమని, కార్యకర్తలు అధైర్యపడొద్దని సూచించారు. ప్రజలు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తూ ప్రజల పక్షాన నిలబడి ప్రతిపక్ష పాత్ర పోషిస్తానని అన్నారు. అయితే అంతకుముందు మీడియాతో మాట్లాడేందుకు క్యాంపు కార్యాలయంకు వచ్చిన ధర్మారెడ్డిని చూసిన బీఆర్ఎస్ మహిళ కార్యకర్తలు కంటతడి పెట్టారు. ఎవరూ బాధపడొద్దని ధర్మారెడ్డి ధైర్యం చెప్పారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షుడు మడికొండ శ్రీను, మున్సిపల్ వైస్ చైర్మన్ రేగూరి విజయ్‌పాల్‌రెడ్డి, నాయకులు నిప్పాని సత్యనారాయణ, సోదా రామకృష్ణ, పావుశెట్టి వెంకటేశ్వర్లుతో పాటు తదిత రులు పాల్గొన్నారు.

అసాంఘిక శక్తులపై అప్రమత్తంగా ఉండాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై అశోక్

వెంకటాపురం(కె): అసాంఘిక శక్తులపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై అశోక్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని నూగూరు గ్రామంలో సీఆర్పీఎఫ్ సిబ్బంది సివిల్ పోలీసులతో కలిసి కమ్యూనిటీ కాంటాక్టు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. గ్రామంలో నెలకొని ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఉన్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేస్తానని అన్నారు. గ్రామంలోని అపరిచిత వ్యక్తులు ఎవరైన వస్తే వారి సమాచారాన్ని పోలీసులకు అందించాలని అన్నారు. గ్రామంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో సివిల్ పోలీసులు, సీఆర్పీఎఫ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాలికల ఆశ్రమ పాఠశాల తనిఖీ



పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న విజయలక్ష్మి

వెంకటాపురం(కె): మండల పరిధిలోని చిరుతపల్లి బాలికల ఆశ్రమ పాఠశాలను సోమవారం కమిషనర్ ఆఫ్ ట్రైబల్ వెల్ఫేర్ ఆదేశాల మేరకు ప్యానల్ గ్రేడ్ హెచ్ఎం విజయలక్ష్మి, పాఠశాల సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల విద్యాబోధన తో పాటు విద్యార్థుల హోం వర్క్, క్లాస్‌వర్క్ నోట్ బుక్స్‌ను పరిశీలించారు. రోజువారి విద్యార్థులకు అందుతున్న టిఫిన్, భోజన సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎం నాగరాజు, తదతరులు ఉన్నారు.

అసంపూర్తిగా రోడ్డు నిర్మాణం



కంకర తేలిన రోడ్డు



షాపెల్లివద్ద అసంపూర్తిగా కల్వర్టు

- పట్టించుకోని ఆర్అండ్‌బీ శాఖ అధికారులు
- కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ
- ఏడాది అవుతున్న ముందుకు కదలని పనులు

ఏటూరునాగారం : మండలంలోని షాపెల్లి, కొత్తూరు, దొడ్ల వరకు ఉన్న రోడ్డు నిర్మాణం అసంపూర్తిగా ఉండడంతో వచ్చిపోయే గిరిజన గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్అండ్‌బీ శాఖ ద్వారా రూ.14 కోట్లతో టెండర్లను దక్కించుకున్న కేఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్ కాంట్రాక్టర్ పనులను మధ్యలో నిలిపివేశాడు. కల్వర్టులు తవ్వి వాటిని పూర్తి చేయలేదు. రోడ్లు తవ్వి రోడ్లు నిర్మించలేదు. కంకర పోసి చదును చేయకుండా వదిలేశాడు. ఇలా సుమారు 12 కిలోమీటర్ల మేర ఉన్న రోడ్డు అసంపూర్తిగా, అధ్వానంగా మారింది. ఆర్అండ్‌బీశాఖ అధికారులు పట్టించుకున్న పాపానపోవడం లేదు. దొడ్ల, షాపెల్లి, షాపెల్లి కొత్తూరు, దొడ్ల కొత్తూరు గ్రామాల నుంచి అనేక మంది ప్రజలు వాహనాల్లో రాకపోకలు సాగిస్తుంటారు. కల్వర్టుల వద్ద కేవలం కాంక్రీట్ వాల్స్ నిర్మించి అసంపూర్తిగా ఉండడం వల్ల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఐదు గ్రామాలకు ప్రధాన రోడ్డు ఇదే కావడంతో ప్రజలు నరకయాతన పడుతున్నారు.

నిలిచిన ఆర్టీసీ బస్సు

గతంలో రోడ్డు మార్గం సక్రమంగా ఉండడంతో ఆర్టీసీ బస్సులు గ్రామాల్లోకి వెళ్లేది. ఇప్పుడు బస్సు సర్వీసు నిలిపివేసి ఏడాది అవుతోంది. రోడ్డు పనులు మొదలైన నాటి నుంచి ఇప్పటి వరకు రోడ్డుపై ఒక తట్టమట్టి కూడా పని చేయలేదన్నారు. ఒక్క అడుగు ముందుకు పని సాగకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ బస్సులు లేక ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణం చేసి జేబులకు చిల్లు పేడుతుందన్నారు.

కాంట్రాక్టు రద్దు చేస్తాం : రఘువీర్ ఆర్అండ్‌బీ డీఈఈ

కేఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్ వారు పనులు సకాలంలో చేయడం లేదని వారికి మూడు సార్లు నోటీసులు జారీ చేశాం. ఇప్పుడు కాంట్రాక్టు కూడా రద్దు చేసేందుకు ఉన్నతాధికారులకు నివేదిక అందజేశాం. త్వరలోనే పాత కాంట్రాక్టు రద్దు చేసి కొత్త కాంట్రాక్టర్ ద్వారా పనులు చేయిస్తాం.

వాహనాలు లేక ఇబ్బంది పడుతున్నాం



రోడ్డు సక్రమంగా లేకపోవడంతో వాహనాలు రావడం లేదు. దీంతో నడిచిపోవాల్సిన ప రిస్థితి నెలకొంది. సామాన్య ప్రజలకు ఎలాంటి వాహనా లు లేక నానా అవస్థలు పడుతూ మండల కేంద్రానికి చేరుకుంటున్నాం. వెంటనే రోడ్డు పనులు చేపట్టాలి. – బొడె సమ్మయ్య, దొడ్ల

కల్వర్టు నిర్మించాలి



కల్వర్టు పనులు ఆగిపోయి ఏడాది అవుతుంది. ఇంజనీరింగ్ అధికారులు పట్టించుకోవడం లేదు. రోడ్డు సరిగా లేక నానాఅవస్థలు పడుతూ పోవాల్సి వస్తోంది. కల్వర్టు నిర్మించి రోడ్డు మార్గం సులభతరం చేయాలి.

– కాటా రాంబాబు, షాపెల్లి కొత్తూరు

స్వచ్ఛతా పక్వాడ్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తునన పోలీసులు

వాజేడు : మండల పరిధిలోని పేరూరులో పోలీసులు స్వచ్ఛతా పక్వాడ్ కార్యక్రమంపై సోమవారం అవగాహన కల్పించారు. సీఆర్పీఎఫ్‌సి 39 బెటాలియన్ సిబ్బంది పేరూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గ్రామస్తులకు అవగాహన కల్పించారు.